క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి

పాలకొండ రూరల్: ఇప్పటికే వివిధ కేసుల్లో శిక్ష అనుభవించిన వారు, కేసుల్లో ఉన్నవారు తమ ప్రవర్తనను మార్చుకోవాలని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ సూచించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తుల నివాస ప్రాంతాలకు సోమవారం పోలీసులు వెళ్లి వారి తాజా జీవన విధానంపై ఆరా తీశారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. నేరాలకు పాల్పడుతూ పట్టుబడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులకు రాయితీపై స్ప్రింక్లర్లు

సీతంపేట: వ్యవసాయ, ఉద్యానవన రైతులకు రాయితీపై స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులు ఇవ్వనున్నట్టు ఉద్యానవన శాఖాధికారి పి.జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. రేషన్‌కార్డు, ఆధార్, 1బీ, బ్యాంకు అకౌంట్, ఎఫ్ఎంబీ మ్యాప్ వంటివి చూపించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995009843, 7995009841కు సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి..


ఎంఈఓ-1 సామల సింహాచలానికి వినతిపత్రం అందిస్తున్న మండల ఎంటీఎస్ ఉపాధ్యాయులు

బలిజిపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎంఈఓ -1 సామల సింహాచలంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తమను రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పని సర్దుబాటుకు కౌన్సెలింగ్ చేపట్టడం వల్ల ఇబ్బందులేర్పడుతున్నాయన్నారు. అలాగే ప్రత్యేక వసతులు కూడా కల్పించడం లేదన్నారు. దీనికి ఎంఈఓ స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

కొండచిలువ హతం


సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురం పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతుల చేతిలో కొండచిలువ హతమైంది. గ్రామానికి చెందిన వన సంరక్షణ రైతు చంటి నర్సరీలో రైతులు సోమవారం ఉదయం మొక్కలు తీస్తుండగా.. ఆరడుగుల కొండచిలువ కనిపించింది. దీంతో భయపడిన రైతులు కర్రలతో కొట్టి చంపారు.

విద్యార్థుల పొలంబాట


వరినారును పరిశీలిస్తున్న విద్యార్థులు

సాలూరు: మండలంలోని పురోహితునిలస ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం పొలంబాట పట్టారు. అగ్రికల్చర్ ఫీల్డ్‌విజిట్ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ అంజలీదేవి, ట్రైనీ మంగమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు పొలానికి వెళ్లి నాట్లు వేయడాన్ని స్వయంగా పరిశీలించారు.

ఎగువ దాగరవలసకు బీటీ రోడ్డు


పూర్తయిన రోడ్డు

సాలూరు రూరల్ : మండలంలోని ఎగువ దాగరవలస గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. నిధులు త్వరితగతిన మంజూరు చేయడంతో రూ. 2.80 కోట్లతో రోడ్డు వేశారు. రోడ్డు పూర్తవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సాలూరు రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కురుకూటి బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యం పరీక్షించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

పాలకొండ రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.హరగోపాల్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు సోమవారం కళాశాలలో 'నష ముక్త భారత్ అభియాన్' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులతో ఎన్ఎంబీఏ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలు లేని సమాజ స్థాపనకు తమ వంతు కృషి చేస్తామంటూ ముక్త కంఠంతో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏజీఎంఓ పైల శంకరావు, ఎన్ఎస్ఎస్ పీఓ వెలమ అప్పరావు, అధ్యాపకులు జి.గోవిందరావు, నారాయణరావు, వెంకటరమణ తదితరులున్నారు.

● భామిని: మత్తుపదార్థాల వినియోగంతో భవిష్యత్ నాశనం అవుతుందని, యువత మత్తుపదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్, ఏపీఎం డి.భవానీ, ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో 'నష ముక్త భారత్ అభియాన్' ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: బస్టాండ్ ఆవరణలో మానవహారం చేపట్టిన ప్రజాప్రతినిధులు, అధికారులు


భామిని: మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

● వీరఘట్టం: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దామని ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం 'నష ముక్త భారత్ అభియాన్' కార్యక్రమం చేపట్టారు. వెలుగు కార్యాలయం నుంచి వీరఘట్టం ప్రధాన రహదారిలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. ర్యాలీలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం శివున్నాయుడు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. ప్రధానంగా యువత ఈ మధ్యకాలంలో ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు., మాదక ద్రవ్యాలు తీసుకోవడం, తరలించడం రెండూ నేరమేనన్నారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, డ్రగ్ ఫ్రీ భారత్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఐటీఐ సిబ్బంది తిరుమలరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి అల్లక లక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్, తదితరులు


వీరఘట్టం: ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడిన డ్వాక్రా సంఘాల సభ్యులు, పోలీసులు


గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఐటీఐలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్ తదితర శాఖల అధికారులు మానవహారం చేపట్టి, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిఒక్కరూ మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మత్తుకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.ఇందుమతి, బి.మహేశ్వరరావు, ఏవో ఎస్.అర్జునరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, ఏపీవో ఎం.గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించండి

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణకు హాజరైన ఆయన.. శిక్షణలో నేర్చుకున్న విషయాలు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలు అవసరమని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో హాజరై, పలు సూచనలు, సలహాలు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ నేర్చుకున్న అంశాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఎంఈవో ఎస్.నాగభూషణరావు, ఏపీవో గౌరీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ


గుమ్మలక్ష్మీపురం: మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య


శిక్షణ ఇస్తున్న రిసోర్సు పర్సన్

సర్పంచ్‌లకు శిక్షణ

సీతంపేట: స్థానిక వైటీసీలో పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల రూపకల్పన, సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వాహణపై రిసోర్సు పర్సన్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీడీఓ గీతాంజలి, డిప్యూటీ సీఈఓ వెంకటరామన్, కోఆర్డినేటర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన


గరుగుబిల్లి: ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో, జాక్టో నాయకులు

వీరఘట్టం: ప్రభుత్వం చేపడుతున్న టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పలు ఉపాధ్యాయ సంఘాలు భహిష్కరించాయి. ఈ మేరకు వీరఘట్టం ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధ్యాయ సంఘాలు నిరసన తెలియజేశాయి. ఉపాధ్యాయ వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ మండల స్థాయిలో ఎంఈఓల పర్యవేక్షణలో చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే తాము అధికారంలోకి వస్తే 117 జీఓను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, కె.విజయకుమార్, బి.బాబూరావు, ఎం.మురళీ, ఆర్.ధనుంజయనాయుడు, జి.దుర్గాప్రసాద్, ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద ఫ్యాప్టో, జాక్టో నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పూడి వెంకటనాయుడు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మర్రాపు రామారావునాయుడు మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, జీవో నంబర్ 53 ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. బొత్స రవి, తంగుడు శ్రీనివాస్, ఎరుకునాయుడు పాల్గొన్నారు.


వీరఘట్టం: ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పాలకొండ రూరల్: స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెద్దకాపు వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు, నేషనల్ గ్రీన్ కార్పొరేషన్ నేతృత్వంలో వక్తృత్వ, డిబేట్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ క్రమంలో బయోడైవర్సిటీలో యువత పాత్ర అనే అంశమై పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో సత్యసాయి విద్యా సంస్థలకు చెందిన పి.కావ్య, జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జి.జ్యోత్స్న విజేతలుగా నిలిచారు. వారికి ఈ నెల 15న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు హెచ్ఎం సోమేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్‌కార్ప్ కోఆర్డినేటర్ ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

జియ్యమ్మవలస: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని ఎంఈవో-2 శ్రీనివాసరావు కోరారు. నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ఖాళీ ప్రదేశాల్లో, ఇంటి ముందు మొక్కలు పెంచేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 శ్రీనివాసరావు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచటం చక్కటి మార్గమని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు, కిచెన్ గార్డెన్ నిర్వహణ, పాఠశాలలో వసతులపై హెచ్ఎం మీసాల సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట: మండలంలోని నారాయణగూడ సమీపంలో 600 లీటర్ల పులిసిన బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్సై జగదీష్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం గ్రామ సందర్శనకు వెళ్లారు. ఆ సమయంలో బెల్లం ఊటలు కనిపించడంతో వాటిని వెలికితీసి ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ఈనెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆర్.ఐ లక్ష్మణనాయుడుతో కలిసి రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు మండలంలోని 41 రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ అనుమతితో రెండు రోజుల్లో విడుదల చేస్తామన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి

సీతంపేట: స్థానిక శాఖాగ్రంథాలయంలో ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ డాక్యుమెంటేషన్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌గా పేరుగాంచిన ఆచార్య ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ బబ్బురు గణేష్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సహాయకుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి

ఎమ్మెల్సీ పరామర్శ

పాలకొండ: పట్టణంలోని నాగవంశపు వీధికి చెందిన పల్లా సీతమ్మకుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. సీతమ్మ శనివారం రోడ్డు దాటుతుండగా పడిపోవడంతో తలకు గాయాలు తగిలాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విక్రాంత్ ఆమె కుమారుడు, 9వ వార్డు కౌన్సిలర్ పల్లా భానును పరామర్శించి ఓదార్చారు. అయనతో పాటు కౌన్సిలర్లు తూముల లక్ష్మణరావు, దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మథరావు, కొంచాడ అరుణ, కడగల రమణ, పల్లా ప్రతాప్, పాలవలస దవళేశ్వరరావు, వై.లిల్లీపుష్పనాథం, యందవ మరియదాస్, తదితరులు ఉన్నారు.


సీతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విక్రాంత్

నాటు వైద్యం ప్రమాదకరం

భామిని: అత్యవసర సమయంలో నాటు వైద్యాన్ని ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని బత్తిలి వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర గిరిజనులకు సూచించారు. మండలంలోని బిచ్చుమానుగూడలో సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. 10 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యం అందించారు. మరో 20 మంది నుంచి రక్తపూతలు సేకరించి పరీక్షలకు పంపించారు. అనారోగ్యం చేస్తే నాటువైద్యులను ఆశ్రయించకుండా దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. నాటు వైద్యం ఒక్కోసారి వికటించి ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందన్నారు. బత్తిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సహకరించారు.

ఆరోగ్య తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని పూతికవలస గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. మండల న్యాయసేవా కమిటీ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యా జోస్పిన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు కె.సందీప్, పి.శుకృత.. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. సీనియర్ న్యాయవాది బరాటం చంద్రమౌళి మాట్లాడుతూ మొత్తం 173కి వైద్య తనిఖీలు చేయగా, వీరిలో 12 మందిని మెరుగైన వైద్యానికి ఆస్పత్రులకు రిఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి.కుమారస్వామి, కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది చంద్రమౌళి

పబ్లిక్ గ్రీవెన్స్ వెలవెల

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ వెలవెలబోయింది. వినతులు ఇచ్చేందుకు ప్రజలు పెద్దగా రాలేదు. వ్యక్తిగత రుణాలతో పాటు గొర్రెలు, మేకల కొనుగోలుకు రుణం ఇప్పించాలని, కొండపోడు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఒకరిద్దరు వినతులు అందజేశారు. ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు వాటిని స్వీకరించి పరిష్కరిస్తామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ నారాయుడు, జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ చిన్నబాబు

ఏబీ రోడ్డుపై దిగబడిన లారీ


బిల్లుమడ వద్ద రోడ్డుపై దిగబడిన లారీ

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు గోతులతో నిండిపోయి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు మరింత పెద్దగా మారడంతో వాహనాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. బిల్లుమడ వద్ద ఏబీ రోడ్డుపై ఏర్పడిన గోతిలో సోమవారం లారీ దిగబడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఒడిశా వైపు వెళ్లాల్సిన లారీలు గంటకు పైగా పాటు నిలిచిపోయాయి.

సరైన ప్రణాళికలతో అభివృద్ధి

పాచిపెంట: సరైన ప్రణాళికలతోనే పంచాయతీలను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణ తరగతుల ద్వారా పంచాయతీల అభివృద్ధికి ఏ విధమైన ప్రణాళికలు సిద్ధం చేయాలో అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాత్రుడు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ

సాలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని ఏఓ అనురాధ పండా అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కషాయం తయారీపై అవగాహన కల్పించారు. భూమిలో జీవవైవిధ్యం పెంపొందించాలంటే ప్రకృతి సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమం వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.